

అడవులను నరికితే చర్యలు

అడవులను నరికిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆర్మూర్ డివిజనల్ అటవీశాఖ అధికారి భవానీశంకర్ అన్నారు.

- 8లో ▸



ప్రమాదకరంగా బావులు

మెండోరా నుంచి బస్సాపూర్ వరకు రోడ్డు పక్కన ఉన్న బావులతో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు వెంబడి ఆరు బావులున్నాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.5 /23.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన డీసీఎస్‌వో



సుభాష్‌నగర్: జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి (డీసీఎస్‌వో)గా టి అరవింద్‌రెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎస్‌వోగా ఉన్న చంద్రప్రకాశ్‌పై సస్పెన్షన్ వేటు వేయడంతో హైదరాబాద్‌లోని శాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సీ పద్మకు జూన్ మొదటి వారంలో డీసీఎస్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మంచిర్యాల ఏసీఎస్‌వో అరవింద్‌రెడ్డిని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిగా బదిలీ చేశారు. ఆయన వెంట ఏసీఎస్‌వో రవినాయక్, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: జవహర్ నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 విద్యా సంవత్సరానికిగాను ఎంపిక పరీక్ష ద్వారా ఆరో తరగతిలో ప్రవేశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 16వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్నవారై మే 2013 – జూలై 2017 మధ్యలో జన్మించివారు అర్హులని వివరించారు.

అధికారులకు ప్రశంసాపత్రాలు




సుభాష్‌నగర్: మార్కుల ఆధారంగా విద్యుత్ సంస్థ ఇటీవల జూన్, జూలై నెలకు ప్రకటించిన ఉత్తమ అధికారులకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలను వరంగల్ చీఫ్ ఇంజనీర్ -1 (ఆపరేషన్) బి అశోక్ శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అందజేశారు. నిజామాబాద్ జిల్లా కంపెనీలోనే మొదటిస్థానానికి చేరుకునేలా ప్రతిఒక్కరూ ప్రయత్నించాలని, వినియోగదారులకు మంచి సేవలు అందించాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్ ఇంట్రాప్షన్స్‌ను తగ్గించాలన్నారు. సమీక్షా సమావేశంలో టెక్నికల్ ఏడీ రమేశ్, ఎస్‌ఏవో రాజశేఖర్, ఎం శ్రీనివాస్, వెంకటరమణ, ఎండీ ముక్తార్, హరిచంద్ర, ఉత్తంజాడే, ఏడీఈలు, ఏఏవోలు, ఏఈఎస్‌లు పాల్గొన్నారు.

ఎండీఎం నిధుల విడుదల

నిజామాబాద్‌అర్బన్: మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి జూలై బిల్లులను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధి కారి దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఒకటి నుంచి ఎనిమిదో తర గతి వరకు కుకింగ్ కాస్ట్ రూ.66 లక్షల 98 వేల 9503, సీసీహెచ్‌ల గౌరవ వేతనాలు రూ.20 లక్షల 44వేలను ఆయా మండలాల వారీగా ఎంఈవోల అకౌంట్‌లలో జమ చేసినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో ఏజెన్సీ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.

ఎవరి వాటా ఎంత?

- మున్సిపల్ కార్పొరేషన్‌లో ముడుపుల మాయ
- ఓ కమర్షియల్ కాంప్లెక్స్‌కు భారీ మొత్తంలో ఫీజు తగ్గింపు
- రూ.2.51 కోట్ల ఫీజును రూ.95లక్షలకు తగ్గించిన వైనం
- ప్రభుత్వానికి రూ.1,55,59,375 ఎగనామం
- ఖలీల్‌వాడిలో నిబంధనలను అతిక్రమించి ఆస్పత్రి భవన నిర్మాణం



టౌన్ ప్లానింగ్ విభాగంలో ఉద్యోగం ఉంటే కాసుల వర్షం కురుస్తుందని, డబ్బులు దండుకోవడానికే తమకు ఉద్యోగం వచ్చిందనే విధంగా వ్యవహరిస్తున్నారు అధికారులు, సిబ్బంది! భవన నిర్మాణ అనుమతుల విషయంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వరకు ముడుపుల మాయను నడిపిస్తున్నారు. నగరంలో చేపట్టిన ఓ కమర్షియల్ భవన నిర్మాణ అనుమతుల మంజూరులో ప్రభుత్వానికి ఏకంగా రూ.1.55కోట్లకు పైగా ఎగనామం పెట్టించి భారీ మొత్తంలో దండుకున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరపాకల సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది డబ్బులు దండుకోవడానికే తమకు ఉద్యోగం వచ్చిందనే విధంగా మాఫియాగా వ్యవహరిస్తున్నారు. ప్రతి ఫైల్‌కు ప్రభుత్వ ఫీజును నామమాత్రం చేయడం, ముడుపులు మాత్రం భారీగా దండుకోవడమనే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఒక్కో ఫైల్‌ను పరిశీలిస్తూ పోతే చిత్రవిచిత్రాలు వెలుగుచూస్తున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దింపితే అక్రమ వ్యవహారాలకు సంబంధించిన ఫైళ్లు అనేకం బయటపడే అవకాశాలున్నాయని నగరవాసులు అంటున్నారు. హైదరాబాద్ రోడ్డులో పులాంగ్ చౌరస్తా వద్ద నిర్మించిన ఓ భారీ కమర్షియల్ కాంప్లెక్స్ అనుమతులకు సంబంధించి అక్రమాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. కాంప్లెక్స్ నిర్మాణ అనుమతులకు సంబంధించి దరఖాస్తు రాగా, రూ.2,50,95,483 ఫీజు చెల్లించాలని నిర్ణయించి దాన్ని హైదరాబాద్‌లోని డీటీసీపీకి పంపించారు. అక్కడి అధికారులు సైతం దీన్ని ఖరారు చేశారు. ఇక్కడే కథ మలుపు తిరిగింది.

రూ.2,50,95,483 ఫీజుకు సంబంధించి హైదరాబాద్ డీటీసీపీ నుంచి అప్రూవ్ అయిన ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టి చివరకు కోల్డ్ స్టోరేజ్‌కు పంపడం గమనార్హం. తరువాత ఇదే నిర్మాణానికి అనుమతుల కోసం మరో కొత్త దరఖాస్తు చేయించారు. ఈసారి ప్రభుత్వ ఫీజు రూ.95,36,108 చెల్లించాలని నిర్ణయించి పంపించగా దీన్ని కూడా హైదరాబాద్ డీటీసీపీ విభాగం అప్రూవ్ చేయడం గమనార్హం. ఈ లెక్కన ప్రభుత్వానికి రూ.1,55,59,375 ఫీజు రాకుండా చేశారు. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్, డీటీసీపీ అధికారులు ముడుపుల పర్వాన్ని పకడ్బందీగా నడిపించడం విశేషం. ఈ ముడుపుల కథలో అప్పటి టీపీవో కరుణాకర్, టీపీఎస్ ప్రవీణ్, ఏసీపీ శ్యాం, డీసీపీ వికాస్, డీటీసీపీ ఏడీ రమేశ్‌బాబు ఎవరి పాత్రను వాళ్లు రక్తికట్టించారు. ఇదిలా ఉండగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించిన స్థలం యజమాని బ్యాంకు నుంచి రూ.36 కోట్ల రుణం తీసుకోవడం గమనార్హం. ప్రభుత్వం సమగ్ర విచారణ చేయిస్తే ఈ ఒక్క ఫైల్ ద్వారానే కాకుండా ఇతర ఫైల్స్‌కు సంబంధించి విస్తుపోయే అక్రమాలు బయటపడతాయని నగర ప్రజలు చెబుతున్నారు.

జీ ప్లస్ త్రీ అనుమతి.. జీ ప్లస్ ఫైవ్ నిర్మాణం

ఖలీల్‌వాడిలోని పవన్ న్యూరో ఆస్పత్రి ఎదురుగా జీ ప్లస్ త్రీ అనుమతి తీసుకుని జీ ప్లస్ ఫైవ్ భవనాన్ని టౌన్ ప్లానింగ్ అధికారుల సంపూర్ణ సహకారంతో నిర్మిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రి భవన నిర్మాణం తుది దశకు చేరింది. పైగా ఇందులో స్టిల్ట్ పేరిట అనుమతులు లేకుండానే సెల్లార్ నిర్మాణం చేపడుతుండడం గమనార్హం. టీపీఎస్‌గా పనిచేసిన కె.ప్రవీణ్ దీంట్లో ముడుపుల కథను నడిపినట్లు సమాచారం. ఇక్కడ మరో కీలక అంశమేమిటంటే లైసెన్స్ ఇంజినీర్లు, సర్వేయర్లు బిల్డర్లుగా అవతారమెత్తి ఈ నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. దీంట్లో నగరానికి చెందిన కీలక ప్రజాప్రతినిధి, ముఖ్య అధికారికి సైతం టీపీవో విభాగంలో పనిచేస్తున్న ఒక అవుట్‌సోర్సింగ్ చైన్‌మన్ ద్వారా వసూళ్ల కథ నడిపినట్లు తెలుస్తోంది. ఈ విషయాలపై నగరపాలక కమిషనర్‌కు ఫోన్ చేస్తే ఏమాత్రం స్పందించకపోవడం గమనార్హం.

ప్లీజ్ వాట్సాప్

నగర మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేస్తే ఆటోమేటిక్‌గా ప్లీజ్ వాట్సాప్ అనే మెసేజ్ వస్తోంది. ఇక నగరంలో సమస్యల విషయమై కమిషనర్‌కు వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపితే సైతం స్పందన లేకపోవడం గమనార్హం. ఈ విషయమై నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా నగరంలోని 7వ డివిజన్‌లో సమస్యలపై వాట్సాప్ మెసేజ్ చేస్తే పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

30న మెగా జాబ్ మేళా

నిజామాబాద్‌అర్బన్: 2023 – 24 విద్య సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల కోసం హెచ్‌సీఎల్ టెక్ బీ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, కంపెనీ ప్రతినిధి ఆర్ రాజేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు వొకేషనల్ గ్రూపుల విద్యార్థులు, సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో 75శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం 80740 65803, 97016 65424 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎల్‌జీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

నిజామాబాద్‌అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ సహకారంతో ఎల్‌జీ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో 90 రోజులపాటు శిక్షణ ఉంటుందని, అర్హులైన బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పది, ఇంటర్ ఉత్తీర్ణులై 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుదారుల తల్లిదండ్రుల ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా 100 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెల కు రూ.4వేల చొప్పున మూడు నెలలపాటు ఉపకార వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, డిష్ వాషర్, ఏసీ రిపేరింగ్, ఇన్‌స్టలేషన్ గ్యాస్ చార్జింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మిగతా వివరాలకు 08462-241055 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డి రొటేషన్ చక్రవర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్, పక్కన రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి

- నేటి రైతు జేఏసీ ఆందోళనకు సంపూర్ణ మద్దతు
- నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: రూ.2లక్షల రుణమాఫీ కావాలంటే ఆపైన ఉన్న సొమ్ము మొత్తాన్ని రైతులు చెల్లించాలనడం సరికాదని, ఇటు తీసుకుని.. అటు ఇవ్వడం రేవంత్‌రెడ్డికి అలవాటేనని, ఆయన రొటేషన్ చక్రవర్తి అని ఎంపీ అర్వింద్ ధర్మపురి ఎద్దేవా చేశారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అబద్ధాలతో అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. జిల్లాలో 2.55లక్షల మంది రైతులు రుణాలు తీసుకుంటే కేవలం 83వేల మందికి మాత్రమే మాఫీ వచ్చిందని తెలిపారు. 70శాతం రైతులు రుణమాఫీ పొందలేదని, వారంతా ఆందోళనలో ఉన్నారన్నారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చిన మాట ప్రకారం ఒక్క చెక్కుతో రుణం మొత్తం మాఫీ చేశారని గుర్తుచేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం, ఏక కాలంలో రూ.2లక్షల రుణాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతు జేఏసీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టనున్న ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నట్లు అర్వింద్ తెలిపారు.

బీజేపీ.. వారిని దరిదాపుల్లోకి రానివ్వదు

ట్రిపుల్ కే (కేసీఆర్, కేటీఆర్, కవిత)ను బీజేపీ దరిదాపుల్లోకి రానివ్వబోదని, ప్రస్తుతం కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు విలీనమవుతున్నారన్నారు. ఎన్నికల్లో గెలిపించే సత్తా ఉన్న నాయకుడే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కావాలని అర్వింద్ అభిప్రాయపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి, నాయకులు, కార్పొరేటర్లు లక్ష్మీనారాయణ, గోపిడి స్రవంతిరెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మరోసారి పీసీసీ!

- బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ పేరును ఖరారు చేసిన అధిష్టానం?
- గతంలో జిల్లా నుంచి వరుసగా రెండు సార్లు పీసీసీ చీఫ్‌గా పని చేసిన డీఎస్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మరోసారి పీసీసీ పీఠం దక్కనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా పార్టీ అధినాయకత్వం ఖరారు చేసినట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలిసి అగ్రనేత రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో ఢిల్లీలో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలోనే పీసీసీ అధ్యక్ష పదవికి మహేశ్‌కుమార్ గౌడ్ పేరును ఖరారు చేసినట్లు తెలిసింది. గతంలో జిల్లా నుంచి ధర్మపురి శ్రీనివాస్ రెండుసార్లు ఉమ్మడి ఏపీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించారు.

దక్షిణ, ఉత్తర తెలంగాణలకు..

సీఎం రేవంత్‌రెడ్డి దక్షిణ తెలంగాణ కావడంతో, పీసీసీ పీఠం ఉత్తర తెలంగాణకు ఇవ్వాలని నాయకత్వం నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే సీఎం ఓసీ కావడంతో పీసీసీ పీఠం బీసీ నేతకు ఇవ్వాలని పార్టీ అగ్రనేతలు నిర్ణయించారు. పీసీసీ కోసం ఎస్టీ కోటా నుంచి మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎస్సీ కోటా నుంచి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పోటీ పడ్డారు. అయితే, బీసీ కోటాలో ఉత్తర తెలంగాణ నాయకుడికి పీసీసీ పగ్గాలు అప్పగించాలని పార్టీ హైకమాండ్ నిర్ణయించింది. మహేశ్‌గౌడ్ సేవలను గుర్తించిన ఏఐసీసీ నాయకత్వం ఇప్పటికే ఎమ్మెల్సీ పదవి కేటాయించింది. మహేశ్ నిజామాబాద్ అర్బన్ టిక్కెట్టు ఆశించినప్పటికీ షబ్బీర్ అలీ రావడంతో త్యాగం చేశారు. ఆ సమయంలో మహేశ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తామని పార్టీ అగ్రనేతలు హామీ ఇచ్చారు. మారిన సమీకరణాల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి కేటాయించేందుకు నిర్ణయించారు.

ఆర్గనైజేషన్ వ్యవహారాల్లో దిట్ట..



నలభై సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తున్న మహేశ్‌గౌడ్ ఎన్ఎస్‌యూఐ నుంచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పీసీసీ కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆర్గనైజింగ్ వ్యవహారాలను వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహేశ్‌కుమార్‌గౌడ్ అత్యంత సమర్థంగా నిర్వర్తిస్తూ వస్తున్నారు. పనితీరే ఆయనకు కలిసొచ్చే అంశం కాగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డికి చాలావరకు భారం తగ్గించడంతో మహేశ్‌గౌడ్‌పై సీఎం సానుకూలంగా ఉన్నారు.

ఆర్మూర్ వేదికగా మరో పోరాటం!

- షరతులు లేని రుణమాఫీ కోసం నేడు రైతుల 'చలో ఆర్మూర్'
- ఆర్మూర్ వేదికగా ఇప్పటికే పలు ఉద్యమాలు



2019లో పసుపు, ఎర్రజొన్నలకు గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కిన రైతులు (ఫైల్)

ఆర్మూర్ : ఐక్య కార్యాచరణ కమిటీల ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధన కోసం ఆర్మూర్ వేదికగా రైతులు ఇప్పటికే మూడు ఉద్యమాలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు షరతులు లేని రుణమాఫీ కోసం రైతన్నల పోరుకు ఆర్మూర్ వేదికైంది. డిమాండ్ల సాధన కోసం ధర్నాలు, ఆమరణ నిరాహార దీక్షలు, రోడ్లపై వంటావార్పు, సహపంక్తి భోజనాలు చేసి తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారు. రాజకీయాలకు అతీతంగా మరో ఉద్యమానికి సిద్ధమైన ఆర్మూర్ ప్రాంత రైతులు సాధించిన విజయాలను పరిశీలిస్తే..

■ నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతమైన ఆర్మూర్, బాల్కొండకు సాగునీరందకపోవడంతో గుత్ప ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు ఉద్యమించగా 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ నిధులు మంజూరు చేయలేదు. తరువాత కాంగ్రెస్ అధికారంలోకి రాగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రూ.204 కోట్లతో అర్గుల్ రాజారాం (గుత్ప) ఎత్తిపోతల పథకాన్ని చేపట్టేందుకు ముందుకు వచ్చింది. 2008 మార్చి18న ఎత్తిపోల పథకం పూర్తి కావడంతో ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలోని 38,792 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది.

■ ప్రైవేట్ సీడ్ వ్యాపారి చేతిలో మోసపోయిన ఎర్రజొన్న రైతులు 2008లో తమ బకాయిలను రాబట్టుకోవడానికి రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. రైతు నాయకులు చేసిన ఆరు రోజుల ఆమరణ నిరాహార దీక్ష హింసాయుతంగా మారి పోలీసు కాల్పులకు దారి తీసింది. నాటి వైఎస్ ప్రభుత్వం రైతులకు రూ.35 కోట్లను రైతులకు చెల్లించింది. మిగతా రూ.10 కోట్ల బకాయిలను 2014లో కేసీఆర్ ప్రభుత్వం చెల్లించింది.

■ పసుపు బోర్డు ఏర్పాటుతోపాటు పసుపు, ఎర్రజొన్న పంటలకు గిట్టుబాటు ధర కోసం ఉద్యమాలు చేపట్టిన రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు.. 2018 – 19లో మరోమారు ఉద్యమ బాట పట్టారు. 44, 63వ నంబర్ జాతీయ రహదారులపై వంటావార్పు, సహపంక్తి భోజనాలతో నిరసనలు తెలిపి కేంద్రం, రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలన్నింటినీ పసుపు బోర్డు ఏర్పాటుకు అనుకూలంగా మారేలా చేశారు. ఆర్మూర్‌లో ధర్నా నిర్వహించడంతోపాటు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 178 మంది పసుపు రైతులు నామినేషన్లు వేసి నాటి సిట్టింగ్ ఎంపీ కల్వకుంట్ల కవిత ఓటమిలో భాగస్వాములు కావడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదే ఎన్నికల్లో మోడీపై పోటీచేసేందుకు రైతులు వారణాసికి తరలివెళ్లి నామినేషన్లు దాఖలు చేశారు. ఇటీవల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పసుపునకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

రైతుల సమావేశానికే అనుమతి



ఖలీల్‌వాడి: రుణమాఫీ కోసం ఆర్మూర్ మండలం మామిడిపల్లి చౌరస్తాలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై రైతులు చేపట్టదలచిన రాస్తారోకో, చలో ఆర్మూర్‌కు అనుమతి లేదని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గుంపులుగా ఉండొద్దని, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా శుక్రవారం సాయంత్రం 6 నుంచి 25వ తేదీ వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. స్థానిక ఏసీపీ అనుమతి తీసుకున్న తరువాతే నిబంధనల ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. దీంతో బీఆర్ఎస్, బీజేపీ, లెఫ్ట్ పార్టీల నాయకులు అనుమతి కోసం ఏసీపీ బస్వారెడ్డికి వినతిపత్రం అందజేయగా, ఆర్మూర్లోని సాయిగార్డెన్ ప్రాంతంలో రైతుల సమావేశానికి ఆయన అనుమతి ఇచ్చారు. చట్టానికి వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పని ఏసీపీ స్పష్టం చేశారు.

తప్పిదాలను సరిదిద్దాల్సిందే

- ఓటరు జాబితా సవరణపై ఎన్నికల సంఘం ఆదేశాలు
- కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే వార్డులో ఉండాలి



మోర్తాడ్(బాల్కొండ): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతూ ఓటరు జాబితా సవరణకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే వార్డులో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి ఉద్యోగులకు నిర్దేశించింది. గతంలో భార్య ఒక పోలింగ్ బూత్‌లో భర్త మరో బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న సందర్భాలు ఎన్నో చోటు చేసుకున్నాయి. ఒక కుటుంబంలోని వ్యక్తులు ఒకే బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా చేయాలని ఎన్నికల కమిషన్ పదే పదే సూచించినా సాంకేతిక సమస్యలు, కొందరు బూత్ లెవల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అది సాధ్యం కాలేదు. ఇలాంటి పరిణామాలు పోలింగ్ శాతం తగ్గేలా ప్రభావితం చేస్తాయని ఎన్నికల కమిషన్ గుర్తించింది. జిల్లాలో కొత్తగా ఆవిర్భవించిన పంచాయతీలను కలుపుకుని 545 గ్రామ పంచాయతీలు, 4,501 వార్డు స్థానాలు ఉన్నాయి. మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంలోని ఓటర్ల జాబితా ఆధారంగా వార్డుల విభజన చేయాల్సి ఉంది. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే వార్డులో ఓటు హక్కు వినియోగించుకునేలా సవరణలు చేయాల్సి ఉంది. గ్రామాల్లో 6.50లక్షల మంది ఓటర్లు ఉండగా జాబితాను మాన్యువల్ పద్ధతిలోనే సవరించి అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించిన తరువాత ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. గతంలో మాదిరిగా కాకుండా పోలింగ్ శాతం పక్కాగా పెరగడానికి ఓటరు జాబితా సవరణ, ఓటర్ల పేర్లు గల్లంతు కాకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది.

సవరణ పక్కాగా చేపట్టనున్నాం

ఎన్నికల సంఘం ఆదేశాలతో ఓటరు జాబితా సవరణ పక్కాగా చేపట్టనున్నాం. గతంలో మాదిరిగా తప్పులు లేకుండా సవరించాలని ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా అభ్యంతరాలు ఉంటే వెంటవెంటనే పరిష్కరించాలని సూచనలు చేశాం.

– శ్రీధర్, ఎంపీవో, మోర్తాడ్

క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- మలేరియా అధికారి తుకారాం రాథోడ్



ఇందల్వాయి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. చంద్రాయణపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలోని రూప్లనాయక్ తండాను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. తండాలో జ్వరంతో బాధపడుతున్న వారికి చికిత్స అందించారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటింటా తిరిగి ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పూల కుండీలు, పాత టైర్లలో నీటి నిలువలను తొలగించాలని సూచించారు. నీటి నిల్వగల ప్రదేశాలను గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదిక పంపాలని ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. ఆయన వెంట ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు సావిత్రి, ఉదయ, ఆనంద్, ఆశా కార్యకర్తలు అనిత, రేనా ఉన్నారు.

సెప్టెంబర్ 18 నుంచి డీఎడ్ సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్అర్బన్: డీఎడ్ సెకండియర్ సప్లిమెంటరీ పరీక్షలను సెప్టెంబర్ 18 నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022–24 ఏడాదికి సంబంధించి సెకండియర్‌లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 18 నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని అన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ఖలీల్‌వాడి: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని టీజీనాబ్ డీఎస్పీ సోమనాథం అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కాలేజీలో డ్రగ్స్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. మత్తు పదార్థాలు తీసుకుంటే జీవితం నాశనం అవుతుందన్నారు. దీంతో కుటుంబం చిన్నాభిన్నంగా మారుతుందని చెప్పారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ నరహరి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'విజయ్' విద్యార్థుల ఎంపిక



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విజయ్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ ప్రభాదేవి శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను స్కూల్ వ్యవస్థాపకురాలు అమృతలత, కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాదకరంగా బావులు!

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



బుస్సాపూర్ - మెండోరా మార్గంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ నుంచి మెండోరా మండల కేంద్రం వరకు రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున బావులు నిండుకుండలా మారాయి. ఈ రోడ్డు వెంట కనీసం ఆరు బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు పక్కన ఉండే బావులకు రక్షణగా గోడలు నిర్మించాలని గతంలో ఉన్నతాధికారులు చెప్పారు. కానీ ఇప్పటి వరకు అలాంటి చర్యలు చేపట్టలేదు. అలాగే ముప్కాల్ మండలం నుంచి మెండోరా వరకు రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావులు సైతం ప్రమాదకరంగా ఉన్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బావుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గతంలో ప్రమాదం..

మెండోరా శివారులోని వ్యవసాయ బావిలో ఆరేళ్ల క్రితం ఆటో బోల్తా పడి 11 మంది జల సమాధి అయ్యారు. అయినా అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోతోంది. ఏదైనా ప్రమాదాలు సంభవిస్తేనే అధికారులు పట్టించుకుంటారా అంటు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుస్సాపూర్ నుంచి మెండోరా మండల కేంద్రం వైపునకు రోడ్డు విస్తీర్ణం చేపట్టారు.

దీంతో వ్యవసాయ బావులు రోడ్డుకు మరింత దగ్గరగా వచ్చాయి. గతంలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు కూడ లేకుండా పోయాయి. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ప్రయాణికులు నెమ్మదిగా వెళ్లే అవకాశం ఉంటుంది. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అడవులను నరికితే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



చెట్లను నరికిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో

సిరికొండ: అడవులను నరికిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆర్మూర్ డివిజనల్ అటవీ శాఖ అధికారి భవాని శంకర్ అన్నారు. సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన 'పోడు పేరిట గొడ్డలి వేటు' అనే కథనానికి అటవీ శాఖ అధికారులు స్పందించారు. మండల శివారులోని అటవీ ప్రాంతంలో నరికిన చెట్లను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్‌వోఎఫ్‌ఆర్ 2006 చట్టం ప్రకారం 2005 డిసెంబర్ 13 కంటే ముందు మాత్రమే సాగులో ఉన్న వారికి హక్కు పత్రాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా హక్కు పత్రాలు వస్తాయని అడవులను నరికితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలో అడవులు ఆక్రమణకు గురవుతున్నాయా లేదా అని రేంజ్ పరిధిలోని పాకాల, పందిమడుగు, చీమన్‌పల్లి, రావుట్ల, న్యావనంది అటవీ ప్రాంతాను ఐదు బృందాలచే తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీవో పేర్కొన్నారు. ఆయా చోట్ల అడవులను నరికినట్లు తెలిసిందన్నారు. వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. హక్కు పత్రాల్లో వచ్చిన విస్తీర్ణం కంటే ఎక్కువగా పోడు చేసినట్లయితే ఆ పట్టాను రద్దు చేసేందుకు కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని తెలిపారు. అడవుల నరికివేతపై స్థానిక సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై కూడా శాఖపరమైన విచారణ చేసి, ప్రమేయం ఉందని రుజువు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీవో తెలిపారు. కమ్మర్‌పల్లి రేంజర్ రవీందర్ తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ కేసులో ఎస్‌హెచ్‌వో చేతివాటం!



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ ప్రధాన పోలీస్ స్టేషన్ అక్రమ వ్యాపారులకు అడ్డాగా మారుతోంది. దీంతో ఈ పీఎస్‌లో ఎస్‌హెచ్‌వోగా పనిచేసేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ పీఎస్ పరిధిలోని ఓ ఇంటి స్థలాన్ని ఆక్రమించేందుకు ఓ ముఠా ప్రయత్నాలు చేపట్టింది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఆ ఇంటి స్థలం విలువ రూ. 30 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు ఉంటుంది. దీంతో ఆ స్థలంపై కన్ను పడిన ముఠా సభ్యులు స్థల పత్రాలను సంపాదించి ఓ మహిళతో ఆధార్‌కార్డును మార్ఫింగ్ చేసి రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత ఆ ఇంటి స్థలం అమ్మకానికి పెట్టినట్లు తెలిసింది. దీంతో ఆ నోట ఈ నోట ఇంటి స్థలం ఒరిజినల్ రిజిస్ట్రేషన్ ఉన్న వారి చెవిన పడింది. దీంతో సదరు మహిళ హైదరాబాద్ నుంచి వచ్చి నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన ఎస్‌హెచ్‌వో నకిలీ ఆధార్‌కార్డుతో ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్న మహిళతో పాటు కుతూరిని పీఎస్‌కు పిలిపించారు. వారు తమకు ఇంటి రిజిస్ట్రేషన్ విషయం తెలియదని ఓ వ్యక్తి డబ్బులు ఇస్తే ఇలా చేసినట్లు పేర్కొన్నారు. దీంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఆధార్‌కార్డు మార్ఫింగ్ చేసిన వ్యకితో పాటు ముఠా సభ్యుల గుట్టురట్టు అయింది. దీంతో కేసు నమోదుకు సిద్ధమైన ఎస్‌హెచ్‌వోతో ముఠా సభ్యులు రాయబారం పెట్టారు. ఇదే పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్ రంగ ప్రవేశం చేసి కేసును సెటిల్‌మెంట్ చేసినట్లు సమాచారం. ఈ కేసులో ఎస్‌హెచ్‌వోకు సుమారు రూ. 5 లక్షల వరకు సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిసింది. దీంతో పాటు సదరు మహిళపై ఉన్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసేందుకు రిజిస్ట్రేషన్ ఆఫీసులోని ఓ డ్యాకుమెంటరీ రైటర్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. ఒరిజినల్ దాక్యుమెంట్ ఉన్న సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తూతూ మంత్రంగా ఒకరిపై కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్నట్లు తెలిసింది. దీంతో పాటు పది రోజుల క్రితం ఈ పీఎస్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగితే బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. అయితే సదరు ఎస్‌హెచ్‌వో సెటిల్‌మెంట్ చేసుకోవాలని హెచ్చరించినట్లు తెలిసింది. కేసు నమోదు చేసేది లేదని స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ విషయమై బాధితులు డివిజనల్ పోలీస్ అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో ఎస్‌హెచ్‌వోను చివాట్లు పెట్టడంతో ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేశారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే పట్టించుకోవాల్సిన పోలీసులు ఇలా ప్రవర్తించడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఎంపీ అర్వింద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

సుభాష్‌నగర్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నాందేడ్ జిల్లా ప్రభారీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. నాందేడ్ జిల్లా కేంద్రంలో తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీకి మాజీ సీఎం అశోక్ చవాన్, రాజ్యసభ ఎంపీ, మరట్వాడ ప్రభారీ భగవత్ జీ కరాడ్ తదితరులు స్వాగతం పలికి సన్మానించారు. సమావేశంలో మరట్వాడ విభాగ సంఘటన మంత్రి సంజయ్ జీ కౌడ్గే, మాజీ ఎంపీ ప్రతాప్ రావు పాటిల్ చిక్లీకర్, రామ పాటిల్ రాథోళీకర్, దేవిదాస్ రాథోడ్, నాందేడ్ దక్షిణ, ఉత్తర జిల్లాల అధ్యక్షుడు సంతుల్ రావు హంబర్డే, కిశోర్ దేశ్‌ముఖ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పూనమ్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

వాసం చంద్రశేఖర్‌కు అవార్డు అందజేత



తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ వాసం చంద్రశేఖర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చేసిన పరిశోధనలకు ప్రత్యక్ష ఎంపిక విధానం ద్వారా ఫెలో–తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ అవార్డును శుక్రవారం అందుకున్నారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ అనేది రాష్ట్ర ప్రభుత్వానికి అనుబంధంగా ఉన్న శాస్త్రీయ మండలి. తెలంగాణలోని శాస్త్ర సాంకేతిక రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న సైంటిస్టులకు అసోసియేట్ ఫెలోలుగా, ఫెలోలకు ఉత్తమ పురస్కారాలు అందజేస్తుంది. చంద్రశేఖర్ ఫెలో–తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ అవార్డును అందుకున్న సందర్భంగా రిజిస్ట్రార్ యాదగిరి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. చంద్రశేఖర్ మార్గదర్శకత్వంలో అంతర్జాతీయంగా అనేక దేశాలలో తెయూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతను టూటా అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ పున్నయ్య, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, కోశాధికారి నాగరాజు తదితరులు అభినందించారు.

డైట్ టెండర్ వాయిదా

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డైట్‌కు సంబంధించిన టెండర్ ప్రక్రియ నిర్వహించినా మళ్లీ వాయిదా పడింది. శుక్రవారం నూతన కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అంకిత్ చాంబర్‌లో డైట్ టెండర్ ప్రక్రియను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తుదారులతో చర్చించినా ఫలితం లేకుండా పోయింది. గతంలో పనిచేసిన అనుభవం జీఎస్టీ, ఐటీ చెల్లింపులు చేస్తున్నారా అనే అంశాలన్నీ వాటికి మార్కులను కేటాయించారు. 12 టెండర్ ఫారాలు దాఖాలు అయ్యాయి. కొంతమంది అరకొర సమాచారం పెట్టినట్లు తెలిసింది. ఓ దశలో టెండర్ నిర్వహణ నిష్పక్షపాతంగా పూర్తి చేయడానికి ప్రయత్నించినా సమయం సరిపోకవడంతోనే వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి ఏడీ రాజశేఖర్ తెలిపారు. త్వరలో మళ్లీ టెండర్ తేదీలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మొట్టమొదటిసారి వాయిదా

ప్రభుత్వ ఆస్పత్రిలో టెండర్‌లో వాయిదా వేయడం ఇది మొదటి సారి. గతంలో టెండర్ ప్రక్రియను మామా అనిపించేశారని ఆరోపణలు ఉన్నాయి. డైట్ నిర్వహణ కోసం టెండర్లు పదుల సంఖ్యలో రావడంతో జీజీహెచ్ అధికారులు సైతం ప్రక్రియ పూర్తి చేయడానికి కుస్తీ పడుతున్నారు. గతంలో ఒక్కటి, రెండు ఫారాలు మాత్రమే వచ్చేవని దీంతో కేవలం రెండు గంటల్లోనే టెండర్ ప్రక్రియ ముగిసేది. ఈ సారీ ఆశావాహులు పోటీపడడంతో అదనపు కలెక్టర్ పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయడానికి ఆలస్యమైనా పక్కాగా పూర్తి చేయనున్నట్లు తెలిసింది. టెండర్‌ను పారదర్శకంగా జరిగేలా చూడాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో 9, 10వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మహిళా సంక్షేమ అధికారి రసూల్‌బీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఇంటర్, ఆపైన ఉన్నత చదువులు చదివే విద్యార్థులు పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు జాతీయ స్థాయిలో మంజూరు కోసం ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



తిరుపతి(ఫైల్)

రాజంపేట: విద్యుత్‌షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని అన్నారం తండాలో చోటు చేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ తిరుపతి(33) శుక్రవారం ఉదయం తన పొలం పనులకు వెళ్లాడు. తన పంట పొలం మీదుగా పక్కన ఉండే రైతులు కరెంట్ సప్లై కోసం తీసుకున్న విద్యుత్ తీగలు తిరుపతికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య బానోత్ సోన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటోలో చైన్‌స్నాచింగ్



బాధితురాలు నర్సుబాయి

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లి శివారులో శుక్రవారం ఆటోలో దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పెర్కిట్‌కు చెందిన బ్రాహ్మణపల్లి నర్సుబాయి పెళ్లికి వెళ్లేందుకు పెర్కిట్‌లో ఆటో ఎక్కింది. అయితే ఆటోలో మరో మహిళ ఉండగా.. ఆమెను మామిడిపల్లి చౌరస్తాలో దింపి ఎంఆర్‌గార్డెన్‌లో నిర్వహించే పెళ్లికి దింపుతామని వృద్ధురాలిని ఆటోడ్రైవర్ నమ్మించాడు. దీంతో ఆటోను మామిడిపల్లి చౌరస్తా కాకుండా హైవేకు ఆనుకొని ఉన్న అయ్యప్ప ఆలయం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ వృద్ధురాలిపై ఆటోలో ఉన్న మహిళ ఆటో డ్రైవర్ దాడి చేసి ఆమె వద్ద ఉన్న మూడు తులాల బంగారు గుండ్లు, తులం బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పోచమ్మగల్లీకి చెందిన గడ్డం రవళి(24) గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అనిల్ రెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రవళి హైదరాబాద్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తోంది. ఈమెకు కొన్ని నెలల క్రితం వివాహ సంబంధం ఖరారు కాగా, కొన్ని కారణాలతో ఇరు పక్షాలు సంబంధాన్ని రద్దు చేసుకున్నారు. దీంతో నాటి నుంచి రవళి మనస్తాపంతో ఉంది. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి కమ్మర్‌పల్లికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ల పట్టివేత



ఇందల్వాయి: ఇందల్వాయి, నిజామాబాద్ సౌత్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అటవీ భూ మిని ఆక్రమించి చదును చేస్తున్న ఐదు ట్రాక్టర్లను ప ట్టుకొని కేసు నమెదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో రవి మో హన్ భట్ తెలిపారు. దుబ్బాక, బాడ్సి, గండితండా, మంచిప్ప, దూస్‌గాం బీట్‌ల పరిధిలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా అటవీ భూముల ను ఆక్రమించి చదును చేస్తున్నట్లు గుర్తించి దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఎవరైనా అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు స్వాధీనం



రుద్రూర్: పొతంగల్ శివారులోని వీరభద్ర మందిరం సమీపంలో, కొడిచర్ల శివారులో అక్రమంగా డంపు చేసిన ఇసుక నిల్వలను రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పొతంగల్ శివారులో సుమారు 35 ట్రాక్టర్లు, కొడిచర్ల శివారులో పది ట్రాక్టర్ల ఇసుక ఉన్నట్లు గుర్తించిన అధికారులు స్వా. దీనం చేసుకున్నారు. శనివారం ఇసుకను తహసీల్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు తహసీల్దార్ మల్లయ్య పే ర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ. ఐదు వే లు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.

బాలుడిపై కుక్కల దాడి

రుద్రూర్: రుద్రూర్, పొతంగల్ మండల కేంద్రాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. చిన్నపిల్లలను బయటకు పంపాలంటే తల్లితండ్రులు జంకుతున్నారు. కుక్కలు గుంపుగుంపులుగా తిరుగుతూ కొత్తవారిపై దాడి చేస్తున్నాయి. శుక్రవారం పొతంగల్ మండల కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్న ఐదేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో గాయపడ్డ బాలుడిని చికిత్స నిమిత్తం కోటగిరి కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

పీఎంపీ నిర్లక్ష్యంతో ఒకరి మృతి



రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు



పెర్మల స్వామి(ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్రంలో పీఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన పెర్మల స్వామి (36) ఆటో మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం ఆయనకు జ్వరంతో పాటు విపరీతమైన కడుపునొప్పి రావడంతో స్థానికంగా ఉండే పీఎంపీ వద్దకు కుటుంబీకులు తీసుకెళ్లారు. పరీక్షించిన సదరు పీఎంపీ స్వామికి సెలైన్ ఎక్కించి నాలుగున్నర గంటల పాటు అక్కడే ఉంచుకున్నాడు. ఆ తర్వాత పరిస్థితి బాగాలేదని కామారెడ్డికి తీసుకెళ్లాలని చెప్పాడు. దీంతో కుటుంబీకులు వెంటనే స్వామిని కామారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందాడు. ఒక గంట ముందు తీసుకు వచ్చి ఉంటే ప్రాణాలు దక్కేవని వైద్యులు చెప్పారు. దీంతో మృతుడి కుటుంబీకులు పీఎంపీ వైద్యుడి ఆస్పత్రికి ఎదుట రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. పీఎంపీ నిర్లక్ష్యంతోనే స్వామి మృతి చెందాడన్నారు. స్వామి మృతితో బాధిత కుటుంబం వీదిన పడిందని నష్టపరిహారం ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై సాయికుమార్ ఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడి సముదాయించారు. ప్రైవేట్ వైద్యులు సైతం మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో బాధిత కుటుంబీకులు, బంధువులు, దళిత సంఘాల నాయకులు రాస్తారోకో విరమించారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్





సీసీ ఫుటేజీలో రికార్డయిన దొంగల కదలికలు, విచారణ చేపడుతున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని స్నేహపురి కాలనీ, వివేకానంద, విద్యానగర్ కాలనీల్లో తాళం వేసి ఉన్న పలువురి ఇళ్లల్లో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. స్నేహపురి కాలనీలోని రోడ్ నెంబర్ 10లో ఉన్న ఖాజా పాషా,ల్యాగ కృష్ణారెడ్డి, విద్యానగర్‌లోని లక్ష్మయ్య, వివేకానంద కాలనీలోని ఉన్న పవన్ కుమార్ ఇండ్ల తాళాలను దుండగులు పగులగొట్టి సామాన్లను చిందరవందర చేశారు. ఆయా ఇండ్లలో దాచి ఉంచిన కొంత బంగారం, వెండి ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. తాళం వేసి ఉన్న ఇళ్ళలో చోరీలు జరిగినట్లు శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. బాధిత కుటుంబాలన్నీ పెళ్లిళ్లు, ఫంక్షన్లు, ఇతర అవసరాల నిమిత్తం ఇళ్లకు తాళం వేసి ఇతర గ్రామాలకు వెళ్లారు. విషయాన్ని గమనించి దుండగులు చోరీలకు పాల్పడ్డారు. అశోక్‌నగర్‌లోని మరో రెండు ఇళ్ల తాళాలను పగులగొట్టి చోరీకి యత్నించారు. కానీ ఆ ఇంట్లో ఎవరూ నివాసం లేకపోవడంతో ఎలాంటి వస్తువులు చోరీకి గురి కాలేదు. పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్ టీం బృందాలను రప్పించి ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించగా ఇద్దరు దొంగలు ముసుగులు ధరించి లోనికి ప్రవేశించినట్లు నమోదైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

బోధన్‌రూరల్: మండలంలోని అమ్దాపూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైరును గురువారం రాత్రి దొంగిలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలోని శివసాయినగర్ కాలనీ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లను ఎత్తుకెళ్ళారు. గ్రామస్తుల సమాచారం మేరకు విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



గాంధారి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చోరీ కేసులో నిందితుడు ములుగు గణేశ్ అలియాస్ గన్నీను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 20న ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు కంప్యూటర్లకు చెందిన పరికరాలు, ఓ బైక్‌ను దొంగిలించారు. సిబ్బంది మమ్మాయి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయగా గాంధారి మండలం గుర్జాల్ గ్రామానికి చెందిన పాత నేరస్తుడు ములుగు గణేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందుతుడి నుంచి దొంగిలించిన బైక్, కంప్యూటర్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హోమ్‌లోన్ సంస్థ కార్యాలయంలో చోరీ

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లోని ఓ హోమ్‌లోన్ సంస్థ కార్యాలయంలో గురువారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం సంస్థ నిర్వాహకులు కార్యాలయం తెరిచే సమయంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డాక్యుమెంట్లు ముట్టనప్పటికి కార్యాలయంలోఉన్న రూ.75వేల నగదు తీసుకువెళ్లారు. సంస్థ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

రౌడీషీటర్‌పై కేసు నమోదు

ఎల్లారెడ్డిరూరల్: గండిమాసానిపేట గ్రామానికి చెందిన రౌడీ షీటర్ జగన్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్‌ను జగన్‌గౌడ్ చంపేస్తానని బెదిరించడంతో అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.